క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తేనే గౌరవం



రాజేశ్వరిని సన్మానిస్తున్న హెచ్‌ఎం వెంకటేష్, ఉపాధ్యాయులు

భోగాపురం: అంకితభావంతో పని చేసినప్పుడే గౌరవం లభిస్తుందని ముక్కాం స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ ఎస్. నళిని అన్నారు. మండలంలోని కొంగవానిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన మక్కువ రాజేశ్వరిని స్కూల్ కాంపెక్స్ చైర్‌పర్సన్ నళినితో పాటు హెచ్‌ఎం ఆళ్ల వెంకటేష్, తోటి ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. శివ ప్రసాద్, ఆళ్ల వైకుంఠరావు, ఎస్. నారాయణమూర్తి, కె. వాసు, నిర్మలాదేవి, సీఆర్‌పీఎంటీఎం మాత శేషుబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశం..



మాట్లాడుతున్న ఎంపీపీ మహంతి కల్యాణి

పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన శనివారం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఆదాయ, వ్యయాలకు సంబంధించిన అంచనా బడ్జెట్.. 2025 – 26 సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2024 – 25 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.1,36,96,706.. రాబడులు రూ. 83,95,98,900.. ఖర్చు రూ. 84,21,36, 420 కాగా అంత్య నిల్వగా 1,11,59,186 రూపాయలను చూపించారు. 2025– 26 సవరణ బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.1,52,80,926.. రాబడులు రూ.74,46,41,900.. ఖర్చు రూ.74,62,26, 120 కాగా.. అంత్య నిల్వగా 1,36,96, 706 రూపాయలుగా చూపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, ఏఓ శ్రీనివాస్, పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రామనారాయణంలో మాజీ సీజేఐ



విశ్రాంత సీజేఐ ఎన్‌వీ రమణకు జ్ఞాపికను అందజేస్తున్న ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వీ రమణ శనివారం సాయంత్రం సందర్శించారు. ఆయనకు ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యుడు నారాయణం శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీజేఐకి ట్రస్ట్ సభ్యులు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారిని..

విజయనగరం టౌన్: నగరంలోని పైడితల్లి అమ్మవారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా జడ్జి బి.సాయి కల్యాణచక్రవర్తి, కలెక్టర్ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఆర్‌డీఓ కీర్తి, తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ కేఎస్‌వీడీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కావాలంటే సచివాలయానికి రావాల్సిందే..

- ఒకేచోట పింఛన్ల పంపిణీ



మండలంలోని కొండకరకాం గ్రామ సచివాలయం వద్దే పింఛన్ల పంపిణీ

విజయనగరం రూరల్: కోడికూయక ముందే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన వలంటీర్లకు ఏమాత్రం తీసిపోకుండా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ నెరవేరడం లేదు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇవ్వాల్సిన సచివాలయ సిబ్బంది నేరుగా సచివాలయానికే లబ్ధిదారులను రప్పించుకుని డబ్బులు అందిస్తున్నారు. కొంతమంది సిబ్బంది గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్దకు పింఛన్‌దారులను రమ్మని చెప్పి ఒక్కదగ్గరే పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. మండలంలోని కొండకరకాంతో పాటు పలు గ్రామాల్లో శనివారం ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై ఎంపీడీఓ తిరుపతిరావు వద్ద సాక్షి ప్రస్తావించగా.. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయమని సిబ్బందిని ఆదేశించామన్నారు. ఎక్కడా ఒకేదగ్గర పింఛన్లు ఇవ్వలేదు. అయితే కొండకరకాం, బడుకొండపేట గ్రామంలో సిగ్నల్స్ లేకపోవడం వల్ల సచివాలయం వద్ద పింఛన్లు ఇచ్చినట్లు తెలిసింది. మండలంలో 5,933 మంది పింఛన్‌దారులుండగా రూ.46,28,000 అందజేసినట్లు తెలిపారు.

- ఆందోళనలో మత్స్యకారులు
- భరోసా సాయం అందక తప్పని అవస్థలు
- ఇబ్బందుల్లో ఐదు వేల మత్స్యకార కుటుంబాలు

వాతావరణ మార్పులతో... జీవనోపాధి కరువు



తిప్పలవలసలో వేటసాగక ఒడ్డున నిలిపిన పడవలు

పూసపాటిరేగ: తీరప్రాంత మత్స్యకారులను ప్రతికూల వాతావరణం దెబ్బతీస్తోంది. తరచూ వాయుగుండం, అల్పపీడనం హెచ్చరికలతో కెరటాలు ఉగ్రరూపం దాల్చడంతో సముద్రంలో వేటకు విరామం ఇచ్చి మత్స్యకారులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. వేటసాగని ఫలితంగా జీవనాధారం కోల్పోతున్నారు. బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడన ద్రోణుల ప్రభావంతో సముద్రంలో అలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సముద్రంలో చేపల వేటకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి జూన్ వరకు 45 రోజుల పాటు ప్రభుత్వం వేటకు విరామం ఇవ్వడంతో ఇంటికే పరిమితమయ్యారు. ఆ తర్వాత నుంచి ప్రకృతి వైపరిత్యాలు, తుఫాన్ల హెచ్చరికలతో నేటివరకు వేట సాగలేదు. ఇదిలా ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మత్స్యకార భరోసా సాయం రూ. 20 వేలు కూడా ఇంతవరకు అందించలేదు. తాజాగా మత్స్యకార భరోసా అందజేస్తామని అమరావతిలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం రోజున ప్రకటించారు. అయినప్పటికీ ఇంతవరకు ఎటువంటి సాయం అందించలేదని మత్స్యకారులు వాపోతున్నారు. మూడు రోజులుగా చింతపల్లి మెరైన్ పోలీసులు తీరప్రాంతంలో వేటను నిలిపివేయించారు. కనీసం ప్రత్యామ్నాయం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. వేట నిలిపివేసిన సమయంలో బియ్యం, ఆర్థిక సహాయం చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాలలో 19 మత్స్యకార గ్రామాలలో 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారిలో సుమారు 5 వేల మంది వేట చేయగా.. వారిపై పరోక్షంగా మరో 16 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారు. పూసపాటిరేగ మండలంలో చింతపల్లి, నీలగెడ్డపేట, చింతపల్లిబర్రిపేట, చింతపల్లిపెద్దూరు, కొత్తూరు, పతివాడబర్రిపేట, తిప్పలవలస, తమ్మయ్యపాలెం, పులిగెడ్డ, కోనాడ, బొడ్డుగురయ్యపేట, బొడ్డు వెంకటేష్‌పేట.. భోగాపురం మండలంలో చేపలుకంచేరు, ముక్కాం, కొండ్రాజుపాలెం, చినకొండ్రాజుపాలెం, చోడిపల్లిపేట, ఎర్రముసలయ్యపాలెం, తదితర మత్స్యకార గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలలో 885 వరకు రిజిస్ట్రేషన్ బోట్లు ఉన్నాయి. అలాగే నాటు పడవలు కూడా ఉంటాయి. ప్రభుత్వం స్పందించి మత్స్యకార భరోసా అందించాలని పలవురు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపించాలి..



తుఫాన్లు, ప్రకృతి వైపరిత్యాల సమయంలో వేట లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మత్స్యకార భరోసా సాయం 20 వేల రూపాయలు అందించి ఆదుకోవాలి. ఈవిషయంలో అధికారులు, ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

బర్రి చినఅప్పన్న , జిల్లా మత్స్యకారసహకార సొసైటీ అధ్యక్షుడు , విజయనగరం.

ఆదుకోవాలి..

అధికారుల సూచనల మేరకు నాలుగు రోజులుగా వేటను నిలిపివేసాం. సముద్రం ఉధృతంగా ఉన్నప్పుడు ఒడ్డున ఉండే వలలు, పడవలు కొట్టుకుపోతుంటాయి. జెట్టీ నిర్మించడంతో పాటు మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

బి. కొర్లయ్య , మత్స్యకారుడు చింతపల్లి.

అంచనా బడ్జెట్‌కు ఆమోదం..

- మేయర్ అధ్యక్షతన సమావేశమైన స్టాండింగ్ కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌వీవీ రాజేష్

విజయనగరం: రానున్న 2025 – 26 వార్షిక బడ్జెట్‌లో 156.93 కోట్ల రూపాయలతో ప్రతిపాదించిన అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. నగర మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి స్వచ్ఛంద విరాళాలు సేకరించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధి (సీఎస్సార్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో.. ఈ ప్రక్రియకు తమవంతు సహాయంగా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వీవీ రాజేష్, సుంకరి నారాయణస్వామి చెరొక 10,116 రూపాయలు విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. అందరి సమన్వయంతో నగరాభివృద్ధి సాధ్యమని తెలిపారు. 156.93 కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నూతన ఒరవడితో బడ్జెట్‌ను రూపొందించి, కొత్త అంశాలను చేర్చడం శుభసూచికమని చెప్పారు. 72.45 కోట్ల రూపాయలను నగర అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. 10 కోట్ల రూపాయల సాధారణ నిధులు కొత్తగా రోడ్లు వేయడానికి.. 12 కోట్ల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు.. కోటి రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం.. కోటీ 50 లక్షల రూపాయలతో హార్టికల్చర్, పట్టణ సుందరీకరణ నిమిత్తం బడ్జెట్‌లో కేటాయింపులు చేశారన్నారు. రూ. 5 కోట్లు మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి.. కోటి రూపాయలతో సెంటర్ లైటింగ్‌కు వెచ్చించనున్నట్లు చెప్పారు. అలాగే మరో కోటీ యాభై లక్షల రూపాయలతో పార్కులు, క్రీడా మైదానాలు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ అధికారులు రూపొందించిన 2025 – 26 వార్షిక బడ్జెట్ అంశాలు ప్రజలకు మేలు చేసే విధంగా ఉన్నాయన్నారు. టెలికాం సంస్థల నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయాలని అధికారులకు సూచించామని చెప్పారు. కార్పొరేషన్ ఆదాయం పెరగడానికి అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణిక్య, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఇసుక వేలంపాట



ఇసుక వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

డెంకాడ: వివిధ దాడుల్లో సీజ్ చేసిన ఇసుకను శనివారం వేలంవేయగా.. 37,500 రూపాయలకు ఎస్. సత్తిబాబు అనే వ్యక్తి కొనుగోలు చేసినట్లు ఎస్సై ఎ. సన్యాసినాయుడు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు డెంకాడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న 103,25 యూనిట్ల ఇసుకను తహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించినట్లు చెప్పారు. నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు తెలిపారు.

సహస్ర దీపార్చన



నగరంలోని అయ్యకోనేరు దక్షిణ గట్టు వద్ద నున్న ఉమామహేశ్వరాలయంలో శనివారం రాత్రి సహస్ర దీపార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు, ఎస్.సూర్యనారాయణరాజు నేతృత్వంలో స్వామి వారికి అర్చకులు మురపాక శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ శివ దీక్షాధరులు, భక్తులు దీపాలు వెలిగించారు. విజయనగరం టౌన్

అంతరాయం తగ్గాలి ..



పరిశ్రమ అంచనాలకు, అకడమిక్ పరిజ్ఞానానికి అంతరాయం తగ్గాలని లెండి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్విజన్ సొల్యూషన్స్, ఏపీ సీటీఈ సహకారంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామారెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా చదువుతున్న విద్యకు, పరిశ్రమ అవసరాలకు మధ్య అంతరం తగ్గుతుందన్నారు. అనంతరం కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎ.రామారావు, సీఎస్‌ఈ విభాగం సమన్వయకర్త పీజేవీఎస్ ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు. – డెంకాడ

అభినందనలు..



రాష్ట్ర స్థాయిలో జరిగిన సెపక్‌తక్ర పోటీల్లో విజనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఇటీవల నంద్యాల జిల్లా నందికొట్కూరులో జరిగిన సబ్ జూనియర్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం దక్కించుకుని విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. అంతేకాకుండా వచ్చే నెల 15 నుంచి కేరళలో జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్స్ పోటీలకు జిల్లాకు చెందిన కుమ్మరి అశ్విని, గండిబోయిన పవిత్రలు ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు, తదితరులు శనివారం అభినందించారు. – విజయనగరం

మీగడకు నగదు పురస్కారం..



గురజాడ విశిష్ట పురస్కార గ్రహీత మీగడ రామలింగస్వామికి రూ. 30 వేల నగదు పురస్కారాన్ని సాయి ఫౌండేషన్ తరఫున డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అందజేసింది. శనివారం స్థానిక గురజాడ అప్పారావు స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో మీగడ రామలింగస్వామికి గురజాడ విశిష్ట పురస్కారంతో గురజాడ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు సత్కరించారు. – విజయనగరం టౌన్

రోగులు ఇబ్బంది పడుతున్నారు..

- జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు బాబ్జి



రోగితో మాట్లాడుతున్న బాబ్జి, తదితరులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని శనివారం కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందించే భోజనంలో కొద్దిపాటి మార్పులు చేయాలని సూచించారు. అలాగే బ్లడ్‌బ్యాంక్, క్యాజువాలిటీ అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. క్యాథ్‌ల్యాబ్, డయాలసిస్ చాంబర్ లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు రొంగలి పోతన్న, నాగేశ్వరావు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ప్రాధాన్యం

- మంత్రులు అనిత, శ్రీనివాస్



పింఛన్ అందజేస్తున్న మంత్రులు

నెల్లిమర్ల: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత, ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని ఆరో వార్డులో శనివారం వారు పింఛన్లు పంపిణీ చేశబూరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒక నెలలో పింఛన్ తీసుకోకపోయినా పింఛన్ ఆగదని, ఈ విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మూడు నెలల పింఛన్ ఒకేసారి తీసుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, డెంకాడ ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాత..

- ఫెంగల్ ప్రభావంతో చిరుజల్లులు
- తడిచిపోయిన ధాన్యం కుప్పలు



గుంకలాంలో పొలాల్లోనే ఉన్న వరి దిబ్బలు

విజయనగరం రూరల్: ఫెంగల్ తుఫాన్ వల్ల చిరుజల్లులు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సరిగ్గా పంట చేతికొచ్చిందన్న సమయంలో తుఫాన్ హెచ్చరికల వల్ల రైతులు పంటను కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ దాదాపు వరి కోతలు పూర్తయ్యాయి. సుమారు 3,213 ఎకరాల్లో కోతలు పూర్తికాగా.. వరి పనలు పొలాల్లోనే ఉంచారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వెంటవెంటనే పంటను కళ్లాలకు తరలించేందుకు ప్రయత్నించగా.. కొంతమంది పొలాల్లోనే కుప్పలుగా పెట్టారు. గుంకలాం, కొండకరకాం, చెల్లూరు, బియ్యాలపేట, కోరుకొండపాలెం గ్రామాల్లో పంట పొలాల్లోనే ధాన్యం కుప్పలు ఉండగా.. ద్వారపూడి, జొన్నవలస, దుప్పాడ, గొల్లలపేట గ్రామాలలో మిషన్లతో కోతలు పూర్తి చేసి ఇళ్లకు ధాన్యం తరలించారు. వర్షాలు మరో రెండు రోజులు కురిస్తే మాత్రం పొలాల్లో ఉన్న పంట రంగు మారిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షంతో ఇబ్బంది



పంట చేతికొచ్చిన సమయానికి తుఫాన్ రావడంతో భయంగా ఉంది. పొలంలోనే పంటను కుప్పలుగా పెట్టాం. గట్టి వర్షం పడితే ధాన్యం రంగుమారిపోయే ప్రమాదముంది. పంటకు నష్టం జరిగితే ప్రభుత్వమే ఆదుకోవాలి. – సుంకరి గౌరినాయుడు, గుంకలాం, యువ రైతు

ఇబ్బంది పడుతున్నాం..



మూడు ఎకరాల్లో వరి వేశాను. తుఫాన్ నేపథ్యంలో పంటను పొలాల్లోనే ఉంచాను. సమయం కాని సమయంలో వర్షం పడడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి.
–రొంగలి అప్పారావు, రైతు కోరుకొండపాలెం

కౌన్సిల్ సమావేశం రసాభాస..

- వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం
- సమస్యలపై చర్చించకుండానే ముగిసిన సమావేశం



సమావేశంలో సభ్యుల మధ్య వాగ్వాదం

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. అనధికార సభ్యులు సమావేశంలో కూర్చోవడం, కౌన్సిలర్లకు తగిన గౌరవం ఇవ్వకపోవడం, అధికారుల తీరు, తదితర కారణాలతో సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. చైర్‌పర్సన్ బంగారు సరోజిని వారించేందుకు ప్రయత్నించినా సభ్యులు ఆగని పరిస్థితి ఏర్పడింది. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అయితే సమావేశానికి అనధికార సభ్యులు హాజరుకావడంపై 3, 7 వార్డుల కౌన్సిలర్లు మొయిద శ్రీనివాసరావు, మైపాడ ప్రసాద్ చైర్‌పర్సన్ వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులకు సరైన కుర్చీలు కూడా వేయకపోవడంపై మండిపడ్డారు. దీనిపై టీడీపీ నాయకుడు లెంక అప్పలనాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ విషయం ఏమైందని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే కొండపేటలో ఇష్టానుసారంగా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారని రెండో వార్డు కౌన్సిలర్ పైల భారతి చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో కూడా సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. మొత్తం మీద తీర్మాన అంశాలపై పూర్తిస్థాయిలో చర్చ జరగకుండానే సమావేశం రసాభాసగా మారింది.

హింసకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం..

- ఐద్వా కార్యదర్శి రమణమ్మ



విజయనగరం అర్బన్: గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: గురజాడ స్ఫూర్తితో హింసకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలూరి రమణమ్మ పిలుపు నిచ్చారు. గురజాడ అప్పారావు 109వ వర్ధంతిని శనివారం స్థానిక ఎల్‌బీజీ నగర్‌లో నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గురజాడ అప్పారావు గొప్ప దేశభక్తుడని, ఆయన రచనలు వెలకట్టలేనివన్నారు. కన్యాశుల్కం నాటకం ద్వారా మహిళలు జీవితాలనే మార్చిన మహా కవి అని కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పుణ్యావతి, రామలక్ష్మి, కుమారి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో..

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో మహాకవి గురజాడ అప్పారావు 109వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఆర్.గురునాథ, వివిధ విభాగాల అధిపతులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్ కె. పద్మలీల, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద నిర్వహించిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెడు అలవాట్లకు దూరంగా ఉంటే హెచ్‌ఐవీ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష చూపకూడదని చెప్పారు. రోగులు క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వాడడంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే జీవితకాలం పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అజయ్‌కుమార్, బొత్స సంతోష్‌కుమార్, చైతన్యబాబు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి చేయాలి

హెచ్‌ఐవీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా శనివారం సాయంత్రం కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో మానవ రెడ్‌రిబ్బన్ తయారు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటి మెడిసిన్ విభాగం డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి. దేవిమాధవి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి

విజయనగరం పూల్‌బాగ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం వల్ల లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, విద్యార్థుల మెదడుల్లోకి మతోన్మాదాన్ని నింపి మత ఘర్షణలను పెంచి పోషిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అమర్‌భవన్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడమే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. పేదల ఆకలి తీర్చకుండా అంబానీ, అదానీలా కుటుంబ ఆస్తులను పెంచుతోందని మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయినా కూడా నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలను కూడా ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ప్రత్యక్షంగా వేలాది మంది, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి పోతుందని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు అభివృద్ధి విషయంలో, బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఫణీంద్ర, షాబీర్, సహాయ కార్యదర్శి నాగభూషణ్, రాష్ట్ర సమితి సభ్యులు గౌరీశంకర్, బాబ్జి పాల్గొన్నారు.